క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(దర్గామిట్ట): సీఎం జగన్‌మోహన్ రెడ్డిని తాడేపల్లిలోని ఆయన నివాసంలో సూళ్లూరుపేట మున్సిపల్ చైర్మన్ శ్రీమంత్‌రెడ్డి మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. ఈ నెల 31న జరగనున్న తన మామ శ్రీనివాసులురెడ్డి కుమార్తె మౌనిక వివాహానికి ఆహ్వానించారు.

కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ తనిఖీలు



నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ కార్యాలయంలోని పలు విభాగాలను మేయర్ స్రవంతి మంగళవారం తనిఖీ చేశారు. టౌన్‌ప్లానింగ్, ప్రజారోగ్యశాఖ, ఎస్టాబ్లిష్‌మెంట్, తదితర విభాగాల్లో రికార్డులను పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి పనితీరును ఆరాతీసిన అనంతరం ఆమె మాట్లాడారు. ప్రజలిచ్చే అర్జీలకు నిర్ణీత గడువులోపు పరిష్కారం లభించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ, నిబద్ధత పాటించాలని కోరారు.

మహాయజ్ఞానికి తరలిన భక్తులు



నెల్లూరు రూరల్: విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహిస్తున్న మహాయజ్ఞానికి నరసింహకొండపై ఉన్న వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నుంచి ప్రత్యేక బస్సులో భక్తులు తరలివెళ్లారు. దేవదాయ శాఖ అధికారుల ఆదేశాలతో ప్రత్యేక బస్సును ఏర్పాటు చేశారు. ఆలయ చైర్మన్ సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై రైతులకు వ్యవసాయ పరికరాలు

ఇందుకూరుపేట: ప్రభుత్వం వైఎస్సార్‌యంత్ర సేవా పథకం కింద రైతు గ్రూపులకు రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు అందజేస్తోందని ఇందుకూరుపేట ఏడీఏ రాజ్‌కుమార్ తెలిపారు. మండలంలోని జగదేవిపేట ఆర్‌బీకేలో జశ్వంత్ రైతుమిత్ర గ్రూప్‌నకు మినీట్రాక్టర్, రొటోవేటర్, పవర్ వీడర్, స్ప్రేయర్, బ్రష్ కట్టర్లను నలభైశాతం సబ్సిడీపై మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు గ్రూపుగా ఏర్పడి దరఖాస్తు చేసుకుంటే రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఏఓ రఘునాథ్‌రెడ్డి, వీఏఏ ఎన్ నవీన్, రైతులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్‌ను నిషేధించాలి

వెంకటాచలం: పర్యావరణ పరిరక్షకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎఫ్ఎస్ఓ శేషయ్య కోరారు. కసుమూరులో అటవీశాఖ ఆధ్వర్యంలో మంగళవారం లైఫ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని వీధుల్లోని ప్లాస్టిక్ వస్తువులను తొలగించి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెట్లను విచక్షణారహితంగా నరికేయడం వల్ల పర్యావరణం దెబ్బతింటుందని తెలిపారు. ప్రతిఒక్కరూ మొక్కలను నాటి సంరక్షించాలని కోరారు. ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణానికి తీవ్రముప్పు ఏర్పడుతుందన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని కోరారు. అనంతరం ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌బీఓ రాజేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన ర్యాలీ

పొదలకూరు : జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పొదలకూరులో వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ఎం రమేష్ మాట్లాడుతూ డెంగీపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డెంగీ దోమలతో వ్యాప్తి చెందుతుందని తెలిపారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవడం, దోమ తెరలు వాడడంతో ద్వారా డెంగీకి చెక్ పెట్టవచ్చని తెలిపారు. ప్రతి శుక్రవారం డ్రైడేను విధిగా పాటించాలని సూచించారు. ఈ ర్యాలీలో మలేరియా సబ్‌యూనిట్ అధికారి ఆంజనేయవర్మ, వైద్యాధికారులు ఆదిలక్ష్మి, రవికుమార్, రమణమ్మ, అనూరాధ, సహాయకులు రాధాకుమారి, శివప్రసాద్, వెంకటేశ్వర్లు, కామాక్షమ్మ, మునిరాధిక, జ్యోతి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నేరాలను కట్టడి చేయాలి

- ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి
- నవాబుపేట పోలీస్‌స్టేషన్లో తనిఖీలు



వాహనాలను పరిశీలిస్తున్న తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): పగలు, రాత్రి గస్తీని ముమ్మరం చేసి నేరాలను కట్టడి చేయాలని ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి ఆదేశించారు. నవాబుపేట పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన పోలీస్ సిబ్బంది పనితీరును ఆరాతీశారు. రికార్డులు, పోలీస్‌స్టేషన్లోని అన్ని విభాగాలను పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరారు. వేసవి దృష్ట్యా దొంగతనాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. పాత నేరస్తుల కదలికలపై నిఘాను పెంచడంతో పాటు జైల్ మానిటరింగ్ వ్యవస్థను పటిష్ఠం చేయాలన్నారు. ఎల్‌హెచ్‌ఎమ్మెస్ సేవలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. చోరీ కేసుల్లో నిందితుల అరెస్ట్, సొత్తు రికవరీపై దృష్టి సారించాలని ఆదేశించారు. రౌడీషీటర్లు, అసాంఘిక శక్తులను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించరాదని, కఠినంగా వ్యవహరించాలని సూచించారు. మహిళలు, చిన్నారుల రక్షణ కోసం ఏర్పాటు చేసిన చట్టాలు, దిశ యాప్‌పై అవగాహన కల్పించాలన్నారు. మిస్సింగ్ కేసుల్లో ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేసి అదృశ్యమైన వారిని త్వరితగతిన గుర్తించాలని తెలిపారు. వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను కోర్టు అనుమతితో వేలం వేయాలని చెప్పారు. అనంతరం సిబ్బంది యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి శుక్రవారం నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం తగదు

- కలెక్టర్ హరినారాయణన్



మాట్లాడుతున్న హరినారాయణన్

నెల్లూరు(పొగతోట): విధుల్లో నిర్లక్ష్యాన్ని విడనాడి మహిళాభ్యున్నతికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను అర్హులకు అందించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. నగరంలోని డీఆర్డీఏ సమావేశ మందిరంలో డీపీఎంలు, ఏసీలు, ఏపీఎంలతో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. విధుల్లో అలసత్వం వహించే వారిపై కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. జిల్లాలో అర్హులైన మహిళలను గుర్తించి స్వయం సహాయక గ్రూపుల్లో సభ్యులుగా చేర్పించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ గ్రూపుల మహిళలపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. బుక్ కీపింగ్ నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. బుక్ కీపింగ్ ప్రక్రియ వంద శాతం ఉండాలని సూచించారు. రుణాల రికవరీ శాతం తక్కువగా ఉందని, ఈ విషయమై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఎస్‌హెచ్‌జీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ ఆసరా, చేయూత, జగనన్న తోడు, తదితర కార్యక్రమాలను అమలు చేస్తోందని, అర్హత కలిగిన మహిళలు పథకాలను సద్వినియోగం చేసుకునేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. అర్హులందర్నీ వైఎస్సార్ బీమా పథకంలో చేర్పించాలని,, ప్రధాన మంత్రి జీవన జ్యోతి, సురక్ష బీమా యోజనకు అర్హుల వివరాలను బ్యాంకుల్లో నమోదు చేయాలని తెలిపారు. వైఎస్సార్ పింఛన్ కోసం వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలను అందజేయాలన్నారు. సీడాప్ ఆధ్వర్యంలో చేపడుతున్న శిక్షణ కార్యక్రమాలను పటిష్ఠంగా అమలు చేయాలని సూచించారు. డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పీడీ సమీక్ష

డీపీఎంలు, ఏసీలు, ఏపీఎంలతో సమావేశాన్ని డీఆర్డీఏ పీడీ నిర్వహించారు. పథకాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలు.. సాధించాల్సిన ప్రగతిపై సమీక్షించారు.

నాడు – నేడు పనులను వేగవంతం చేయాలి



పనులను పరిశీలిస్తున్న వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): నాడు – నేడు పనులను వేగవంతం చేసి పాఠశాలల పునఃప్రారంభం నాటికి అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. నవాబుపేటలోని మున్సిపల్ పాఠశాలలో జరుగుతున్న నిర్మాణ పనులను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. అదనపు తరగతి గదులతో పాటు మరుగుదొడ్ల నిర్మాణాలను జూన్ 12 నాటికి పూర్తి చేయాలని సూచించారు. అనంతరం సుబేదారుపేటలో నిర్మాణంలో ఉన్న ప్రజా మరుగుదొడ్ల పనులను తనిఖీ చేశారు. ఇంజినీరింగ్ విభాగ ఎస్ఈ సంపత్‌కుమార్, ఈఈలు చంద్రయ్య, అనిల్, ఏఈ మాధవి, తదితరులు పాల్గొన్నారు.

చెత్తను వేర్వేరుగా అందజేయాలి

తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలని కమిషనర్ కోరారు. 39, 40వ డివిజన్ల పరిధిలో గల మూలాపేట, మెక్లిన్స్‌రోడ్డు, పుట్టా లేఅవుట్, సాయినగర్‌లో గల శానిటేషన్ మస్టర్ పాయింట్లను తనిఖీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. చెత్త సేకరణకు సంబంధించిన యూజర్ చార్జీలను ప్రతి ఒక్కరూ బాధ్యతగా చెల్లించాలని కోరారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేస్తే జరిమానా విధిస్తామని స్పష్టం చేశారు. ఎంహెచ్ఓ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ వేమిరెడ్డికి సత్కారం



నెల్లూరు(దర్గామిట్ట): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు సుధీర్‌కుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను సత్కరించారు.

ప్రగతి చారిటీస్‌లో అన్నదానం



నెల్లూరు(బృందావనం): వేదాయపాళెంలోని ప్రగతి చారిటీస్‌లో అన్నదానాన్ని మంగళవారం నిర్వహించారు. గోపీ, వాసంతి కుమారుడు బాలాదిత్య ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ఉత్తమ మార్కులను సాధించిన సందర్భంగా కార్యక్రమాన్ని చేపట్టారని రాష్ట్ర ప్రభుత్వోద్యోగ సంఘ నేత సుధాకర్‌రావు తెలిపారు. మానవసేవే మాధవ సేవ బృంద సభ్యులు పరిమళ, రవి, విశ్వనాథం,, పుల్లారెడ్డి, రమణరావు, శ్రీనివాసులు, అక్షయ, తదితరులు పాల్గొన్నారు.

... లో ఓల్టేజీ సమస్యకు పరిష్కారం



పరిశీలిస్తున్న మన్మథరావు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 54వ డివిజన్ భగత్‌సింగ్‌కాలనీ, జనార్దన్‌రెడ్డికాలనీ, ఇస్లాంపేట ప్రాంతాల్లో లోఓల్టేజీ సమస్య శాశ్వత పరిష్కారం కోసం చర్యలు చేపట్టనున్నామని ఈఈ – 1 ఏఈ మన్మథరావు పేర్కొన్నారు. నగరంలోని 54వ డివిజన్లో గల పలు ప్రాంతాల్లో తనిఖీలను మంగళవారం చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈ ప్రాంతంలో లోఓల్టేజీ సమస్యతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టనున్నామని వివరించారు. భగత్‌సింగ్‌కాలనీ, జనార్దన్‌రెడ్డికాలనీ, ఇస్లాంపేట ప్రాంతాల్లో 100 కేవీ కెపాసిటీ కలిగిన మూడు అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వీటి ఏర్పాటు ప్రక్రియ వారంలో పూర్తవుతుందని తెలిపారు. సిబ్బంది సుధాకర్, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

బీపీతోనే హృద్రోగ సమస్యలు



నెల్లూరు (అర్బన్): గుండె వ్యాధులకు ప్రధాన కారణం బీపీయేనని మెడికవర్ సూపర్ స్పెషాల్టీ హాస్పిటల్ సీనియర్ గుండె వ్యాధి నిపుణుడు విజయ్‌అమర్‌నాథ్‌రెడ్డి, డాక్టర్లు బాలకృష్ణ, రామ్‌ప్రసాద్, జయరామ్ పేర్కొన్నారు. ప్రపంచ హైపర్ టెన్షన్ దినోత్సవాన్ని పురస్కరించుకొని రోగులు, వారి బంధువులకు ఆస్పత్రిలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రక్తపోటు కారణంగా గుండె, కిడ్నీ, మెదడు సంబంధిత వ్యాధులొచ్చే అవకాశం ఉందని చెప్పారు. తమ ఆస్పత్రిలో గుండెకు సంబంధించిన సూపర్ స్పెషాల్టీ సేవలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో సెంటర్ హెడ్ డాక్టర్ గణేష్, ఆస్పత్రి వైస్ ప్రెసిడెంట్ మహేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు



నెల్లూరు (వేదాయపాళెం): నగరంలోని వీఆర్ హైస్కూల్ గ్రౌండ్స్‌లో మే డే ఉత్సవాలను ఆటో కార్మిక సంఘ నగర కమిటీ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ట్రాఫిక్ డీఎస్పీ సుబహాన్ మాట్లాడారు. క్రికెట్ పోటీలకు సంబంధించి పది జట్లు రిజిస్ట్రేషన్ చేసుకోవడాన్ని అభినందించారు. ఆటో కార్మిక సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజా, సురేష్, నేతలు శ్రీనివాసులు, సూర్యనారాయణ, సుధాకర్, నాగూర్, వెంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కలకు టీకాలు



నెల్లూరు(బారకాసు): వీధి కుక్కల కాటు నుంచి ప్రజలకు ప్రమాదకర పరిస్థితులు తలెత్తకుండా నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించి యాంటీ రేబిస్ టీకాలను వేయనున్నామని కమిషనర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. బాలాజీనగర్‌లో గల కాంతమ్మ ఆశ్రమ సమీపంలోని సచివాలయం వద్ద వీధి కుక్కలకు రేబిస్ టీకాలు వేసే కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. టీకాలు వేసిన అనంతరం కుక్కలను ఆయా ప్రాంతాల్లోనే వదిలేస్తామని చెప్పారు. అనంతరం బాలాజీనగర్‌లోని 15 / 1, 2, 3, 16 / 1, 2, 3 సచివాలయాలను తనిఖీ చేశారు. కార్పొరేటర్లు సుజాత, శ్రీకాంత్‌రెడ్డి, ఎంహెచ్ఓ వెంకటరమణ, పశువైద్యాధికారి మదన్‌మోహన్, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



నెల్లూరు రూరల్: కందమూరులోని సచివాలయంలో చలివేంద్రాన్ని రూరల్ ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలేంద్రకుమార్ మంగళవారం ప్రారంభించారు. వేసవి తీవ్రత నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

పాస్టర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శిగా జెర్మియా



నెల్లూరు(బృందావనం): ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శిగా ముత్తుకూరు మండలం నేలటూరుకు చెందిన రెవరెండ్ జెర్మియాను నియమించారు. దీనికి సంబంధించిన నియామక పత్రాన్ని మూలాపేటలోని హెర్మోన్ చర్చిలో ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు రెవరెండ్ రాజశేఖర్ మంగళవారం అందజేశారు. నేతలు ప్రేమ్‌కుమార్, సజీవరావు, సందీప్ ప్రిన్స్, ఆంథోనీ, జోసఫ్‌బాబు, చక్రిబాబు, శ్యామ్, వేదాంత్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు

నెల్లూరు (వేదాయపాళెం): అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటర్వ్యూలను నిర్వహించనున్నామని ఐసీడీఎస్ పీడీ సౌజన్య మంగళవారం తెలిపారు. జిల్లాలో ఖాళీగా ఉన్న 11 అంగన్‌వాడీ కార్యకర్తలు, రెండు మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు, 55 హెల్పర్ పోస్టులకు అర్హుల నుంచి దరఖాస్తులను స్వీకరించామని చెప్పారు. దరఖాస్తు చేసుకున్న వారు డివిజన్ల వారీగా వారికి కేటాయించిన తేదీల్లో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు. ఆత్మకూరు డివిజన్‌కు సంబంధించి ఈ నెల 18న, నెల్లూరు, కావలి డివిజన్లకు 19న, కందుకూరు డివిజన్‌కు 20న ఇంటర్వ్యూలను నిర్వహించనున్నామని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు ఆయా ఆర్డీఓ కేంద్రాలకు హాజరుకావాలని కోరారు.

కార్మికులకు రక్షణ కల్పించాలి

నెల్లూరు(వేదాయపాళెం): ప్రభుత్వ ఆదేశాల మేరకు భవన నిర్మాణ, ఇటుక బట్టీలు, పరిశ్రమలు, ఫ్యాక్టరీల యజమానులు వారి వద్ద పనిచేసే కార్మికులకు ఎండ వేడిమి నుంచి తగిన రక్షణ చర్యలు చేపట్టాలని కార్మిక శాఖ ఉప కమిషనర్ వెంకటేశ్వరరావు మంగళవారం తెలిపారు. కార్మికులు పనిచేసే చోట తగిన మంచినీరు, మజ్జిగ, ఓఆర్ఎస్, గ్లూకోజ్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు.

క్రైమ్ కార్నర్

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్ట్



మాట్లాడుతున్న సైదులు

నెల్లూరు (క్రైమ్): చెప్పులు కుట్టుకునే వ్యక్తిపై మద్యం మత్తులో కత్తితో దాడి చేసి గాయపర్చిన కేసులో నిందితుడ్ని చిన్నబజార్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. దీనికి సంబంధించిన వివరాలను ఎస్సై సైదులు తెలియజేశారు. వీఆర్సీ ప్రాంతంలో ప్రకాష్ అనే వ్యక్తి చెప్పులు కుట్టుకొని జీవనం సాగిస్తున్నారు. సంతపేటలోని బుజ్జమ్మరేవుకు చెందిన శేషు మద్యం మత్తులో ప్రకాష్‌ను కత్తితో పొడిచి హత్యాయత్నానికి ఆదివారం పాల్పడ్డారు. స్థానికులు రావడంతో అక్కడి నుంచి నిందితుడు పరారయ్యాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసును నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పరారీలో ఉన్న శేషును వాకర్స్ రోడ్డు సమీపంలో అదుపులోకి తీసుకొని దాడికి వినియోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు. శేషును అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు.

విధులకు ఆటంకం.. పలువురిపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): కమిషనర్‌తో పాటు సిబ్బంది విధులకు ఆటంకం కలిగించిన పలువురిపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. స్పందన పిటిషన్ విచారణలో భాగంగా కమిషనర్ వికాస్ మర్మత్ తన సిబ్బందితో కలిసి చైతన్యపురికాలనీలోని పార్కు స్థలం వద్దకు వెళ్లారు. పార్కును పరిశీలిస్తుండగా బీజేవైఎం నేత సురేష్‌తో పాటు పెంచలయ్య, అస్లామ్, మల్లికార్జున, వెంకటేశ్వర్లు, మునిశేఖర్, అశోక్, రాంబాబు, పుష్పరాజ్, సాయిసునీల్ అడ్డుకొని వారి విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా దౌర్జన్యం చేశారు. ఈ మేరకు పోలీసులకు కమిషనర్ కారు డ్రైవర్ చిన్నయ్య ఫిర్యాదు చేశారు. దీంతో నిందితులపై కేసు నమోదు చేశారు.

యువతి అదృశ్యం

నెల్లూరు సిటీ: యువతి అదృశ్యమైన ఘటనపై బాలాజీనగర్ పోలీసులు కేసును మంగళవారం నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. పద్మావతినగర్‌లోని పుట్టవీధిలో నివసిస్తున్న ఓ యువతి నగరంలోని ఓ కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతోంది. ఆమెను కళాశాల వద్ద సోదరుడు సోమవారం వదిలి వచ్చారు. సాయంత్రమైనా ఇంటికి యువతి రాకపోవడంతో కళాశాలకు వెళ్లి తండ్రి ఆరాతీశారు. కళాశాల నుంచి వెళ్లిపోయిందని వారు సమాధానమిచ్చారు. దీంతో ఆమె కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అయినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ చోరీ

నెల్లూరు సిటీ: బైక్ చోరీకి గురైన ఘటనపై దర్గామిట్ట పోలీసులు కేసును మంగళవారం నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. ఏపీ జెన్‌కోలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న ముత్తుకూరు మండలంలోని సింహాద్రినగర్‌కు చెందిన వెంకయ్య తన పల్సర్ బైక్‌పై నగరానికి ఈ నెల 13న వచ్చారు.
ఎంజీబీ మాల్ సమీపంలో బైక్‌ను నిలిపి సినిమాకు వెళ్లారు. అనంతరం తిరిగొచ్చేసరికి బైక్ కనిపించకపోవడంతో గాలింపు చర్యలు చేపట్టారు. అయినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నగదు పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (వేదాయపాళెం): నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు బహుమతులను డాక్టర్ మాదాల వెంకటేశ్వరావు, సుజాతమ్మ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అందజేయనున్నామని ట్రస్ట్ చైర్మన్ వెంకటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.
పదో తరగతిలో 550కుపైగా మార్కులు సాధించిన వారికి పొగతోటలోని సమతా నర్సింగ్ హోమ్‌లో అవార్డులను ఈ నెల 28న అందజేయనున్నామని చెప్పారు. మార్కుల మెమోతో సమతా నర్సింగ్ హోమ్‌లో ఈ నెల 24లోపు పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. 550 మార్కులు రాని ఉన్నత పాఠశాలల్లో స్కూల్ టాపర్ ఒకరికి చొప్పున నగదు బహుమతిని ఇవ్వనున్నామని, వివరాలకు 94923 38449 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఆక్రమణ ఆరోపణలపై విచారణ

నెల్లూరు (బారకాసు): ఎఫ్‌సీఐ గోదాముల సమీపంలోని చైతన్యపురి కాలనీలో పార్కు స్థలం ప్రైవేట్ వ్యక్తుల పరం చేస్తున్నారంటూ వస్తున్న ఆరోపణలపై విచారణ జరిపి నివేదికను అందజేయాల్సిందిగా టౌన్‌ప్లానింగ్ అధికారులను కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. పార్కు స్థలాన్ని అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. చైతన్యపురి కాలనీ ప్రాంతంలోని పార్కు స్థల విషయమై పూర్తి స్థాయిలో విచారణ జరిపి వాస్తవాలను తెలియజేస్తామన్నారు.